నేడు పాడేరులో స్పందన కార్యక్రమం

» కలెక్టర్ విజయసునీత వెల్లడి

పాడేరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ విజయసునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీ ప్రాంతం ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.



ప్రారంభానికి సిద్ధమవుతున్న మహిళా డిగ్రీ కళాశాల

శరవేగంగా మహిళా డిగ్రీ కళాశాల పనులు

ప్రారంభానికి సిద్ధమవుతున్న భవన సముదాయాలు

అరకులోయ, ఫిబ్రవరి 29:

ఎట్టకేలకు అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల భవన సముదాయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. రెండేళ్ల క్రితమే భవన సముదాయాలు పూర్తి కావలసి ఉండగా కరోనా, ఆ తరువాత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడం వంటి కారణాల వల్ల జాప్యం జరిగింది. అయితే వెంటనే పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జోరుగా పనులు సాగుతున్నాయి.



విద్యుత్ వైరింగ్ పనులు చేపడుతున్న దృశ్యం

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం రూసా నిధులతో మహిళా డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అరకులోయకు కళాశాలను మంజూరు చేశారు. 2019 ఫిబ్రవరి 3న జమ్ము కశ్మీరులో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో మహిళా కళాశాల భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. సుమారు రూ.12 కోట్లతో ఈ కళాశాల భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్



కళాశాల భవనం ముఖద్వారం వద్ద ఫినిషింగ్ పనులు చేస్తున్న దృశ్యం

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. రెండేళ్లు కరోనా వల్ల, ఆ తరువాత బిల్లుల మంజూరులో జాప్యం వల్ల పనులకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఈ కళాశాల విద్యార్థినులకు కో-ఎడ్యుకేషన్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు కళాశాలల ప్రారంభం సందర్భంగా దీనిని కూడా ప్రారంభించే అవకాశం ఉండడంతో వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో నెల రోజులుగా పనులు జోరుగా సాగుతున్నాయి. తరగతులు, బోధన, ప్రాక్టికల్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా మొదటగా మెయిన్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను సిద్ధం చేస్తున్నారు. అలాగే విద్యార్థినుల వసతి గృహ భవనాన్ని కూడా పూర్తి చేస్తున్నారు. మరో పది రోజుల్లో పనులు దాదాపు పూర్తి కావచ్చునని అధికారులు చెబుతున్నారు.

సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు

నేటి నుంచి ప్రారంభం

» జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలు

» 14,611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు



పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బెంచీలపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

పాడేరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో పాడేరు డివిజన్ పరిధిలో 17, రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలో 10 పరీక్షా కేంద్రాలున్నాయి. మొత్తం 14,611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వారిలో 12,054 మంది జనరల్, 2,557 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.అప్పలరాము తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఇతరులు పరీక్షా కేంద్రానికి దూరంగా ఉండాలని అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 27 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 610 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 380 మంది జనరల్, 550 మంది ఒకేషన్ విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ సీహెచ్.రమాదేవి తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించడంతోపాటు ఆత్మ విశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కళాశాల అధ్యాపకులు కోరుతున్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

వైసీపీ నేతల అవినీతిని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు

» గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాకు అడ్డాగా ఏపీ

» యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవు

» ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశారు

» నారా భువనేశ్వరి ధ్వజం

» చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి' కార్యక్రమాలు



బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అనకాపల్లి/ రోలుగుంట/ రావికమతం/ బుచ్చెయ్యపేట/, ఫిబ్రవరి 29:

వైసీపీ నాయకులు నరరూప రాక్షసుల్లా ప్రవర్తిస్తూ, వారి అక్రమాలను ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతున్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలం జేపీ అగ్రహారం, కొవ్వూరు, రావికమతం మండలం గంపవానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం, ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం ఆరబుపాలెం, వాడ్రాపల్లి, గొల్లలపాలెం గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్రమనస్తాపానికి గురై గుండెలు ఆగిన పలువురి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా కొవ్వూరు, గంపవానిపాలెం, ఆర్.భీమవరం గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం గ్రామంలో హంసవేణి అనే మహిళ చేతిపంపు నుంచి తాగునీరు రావడం లేదని ఫిర్యాదు చేసిందనే కోపంతో వైసీపీ నాయకులు ఆమెపై దాడి చేసి రెండు కళ్లు పీకేసి తమ రాక్షసత్వాన్ని చూపారన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న, కల్తీ మద్యం గురించి ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలను వైసీపీ నాయకులు



మునగపాక మండలం గొల్లలపాలెంలో మొల్లి అప్పలనర్స కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న నారా భువనేశ్వరి

పొట్టనబెట్టుకున్నారని అన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర పరువు, ప్రతిష్టలు దిగజారిపోయాయని, ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారని ఆమె చెప్పారు. ఏపీని గంజాయి, కల్తీ మద్యం, ఇసుక మాఫియాలో నంబరు వన్ స్థానంలో నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ఒక తరం భవిష్యత్తును జగన్ నాశనం చేశాడన్నారు. జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని, మీ పిల్లలతోపాటు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని, టీడీపీ ... మిగతా 8వ పేజీలో

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు కార్యాచరణ

» డీఎఫ్‌వో సూర్యనారాయణ



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లి, ఫిబ్రవరి 29: అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని డివిజనల్ ఫారెస్టు అధికారి(డీఎఫ్‌వో) చిట్టపల్లి సూర్యనారాయణ తెలిపారు. గురువారం డివిజన్ స్థాయి అటవీశాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి డివిజన్ పరిధి రిజర్వుడ్ ఫారెస్టు భూముల్లో 788 ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నట్టు భారత ప్రభుత్వం నివేదిక ఇచ్చిందన్నారు. గత ఏడాది 769 ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించాయన్నారు. భారత ప్రభుత్వం శాటిలైట్ ద్వారా అగ్నిప్రమాదాలను గుర్తించి ఏపీ ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపిస్తుందని, ఏపీ ప్రభుత్వం సంబంధిత డివిజన్ పరిధి అటవీశాఖ అధికారులకు సమాచారం పంపిస్తుందన్నారు. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. గత ఏడాది ఫిబ్రవరి వరకు 200 ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించగా, ఈ ఏడాది కేవలం 28 ప్రాంతాల్లో మాత్రమే అగ్నిప్రమాదాలు సంభవించాయన్నారు. అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు అటవీశాఖ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో చెట్ల నుంచి ఆకులు రాలిపోతాయని, వేట, బొడ్డెంగుల కోసం అడవికి వెళ్లిన ఆదివాసీలు అగ్గి పెట్టుకుని ఆర్పివేయకుండా వచ్చేయడం వల్ల అడవులు తగలబడుతున్నాయన్నారు. ప్రధానంగా వెదురు మొక్కలు కలిగిన ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డివిజన్‌లోని సీలేరు, ఆర్‌వీనగర్, చింతపల్లి, మర్రిపాకలు(డౌనూరు) రేంజ్‌ల పరిధిలో అగ్నిప్రమాద ప్రాంతాలు అధికంగా ఉండడంతో సంబంధిత పరిధి అటవీశాఖ ఉద్యోగులను అప్రమత్తం చేశామని తెలిపారు. అటవీశాఖ ఉద్యోగులు గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు, శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేస్తున్నామన్నారు. అడవిలోకి వెళ్లిన సమయంలో ఎక్కడా మంట పెట్టరాదని, ఈ విధంగా చేయడం వల్ల అడవులు తగలబడిపోతున్నాయని చైతన్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. అడవుల్లో అటవీశాఖ ఉద్యోగులు ఫైర్‌లైన్ క్లియరెన్స్ పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, పెదవలస రేంజ్ అధికారులు పాత్రుడు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యం

» ఐటీడీఏ పీవో వి.అభిషేక్

» ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార రథం ప్రారంభం

పాడేరు ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి):

సికిల్‌సెల్ ఎనీమియా రహిత గిరిజన సమాజమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఏజెన్సీలో గిరిజనులను దీనిపై చైతన్య పరచాలన్నారు. ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్(జన్‌మన్)లో భాగంగా ఏర్పాటు చేసిన సికిల్‌సెల్ ఎనీమియా ప్రచార రథాలను ఆయన గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్దేశించాయన్నారు. తొలి విడతగా స్థానిక ఐటీడీఏకు రెండు ప్రచార వాహనాలు పాడేరు చేరుకున్నాయని, మరో నాలుగు వాహనాలు త్వరలో వస్తాయన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 35 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో సికిల్ సెల్ ఎనీమియాపై ప్రచారం చేసి గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ పరిధిలో 1,550 గ్రామాల్లో ప్రచారం చేయాలనేది లక్ష్యంగా నిర్దేశించామని, ప్రతి రోజు మూడు నుంచి ఐదు గ్రామాల్లో ప్రచార రథం పర్యటించాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాలకు ప్రచార రథం వచ్చిన సమయంలో సంబంధిత వైద్యాధికారి, వైద్య సిబ్బంది, గ్రామ సర్పంచులు విధిగా భాగస్వామ్యం కావాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలను, నివారణ చర్యలను ప్రజలకు వివరించాలని ఐటీడీఏ పీవో సూచించారు. ఐటీడీఏ పరిధిలో లక్షా పది వేల మందికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా వారిలో 1,050 మందికి సికిల్‌సెల్ ఎనీమియా పాజిటివ్ వచ్చిందని, వారికి మరో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే 650 మందికి



జెండా ఊపి సికిల్‌సెల్ ఎనీమియా ప్రచార రథం ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

సికిల్ సెల్ ఎనీమియా ఉందని తేలిందన్నారు. దీంతో వారికి అవసరమైన మందులు, సికిల్ సెల్ ఎనీమియా పింఛన్ మంజూరుకు సిఫారసు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వీఎస్.ప్రభాకరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు

» కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుదల



పాడేరు- జి.మాడుగుల మెయిన్‌రోడ్డులో గురువారం ఉదయం పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి):

ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నప్పటికీ పొగమంచు మాత్రం తగ్గడం లేదు. పాడేరు, పరిసర ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగానే కమ్మేసింది. జి.మాడుగులలో 14.2, పెదబయలులో 17.2, అరకులోయలో 17.4, ముంచంగిపుట్టులో 17.6, డుంబ్రిగుడలో 17.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగ మంచు కురిసినప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఎండ ప్రభావం కొనసాగింది.

చింతపల్లిలో...

చింతపల్లి: శీతాకాల సీజన్ ముగుస్తుండంతో గిరిజన ప్రాంతాల్లో మంచు ఉధృతి ... మిగతా 8వ పేజీలో

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

» సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

» అధికారులకు కలెక్టర్ విజయసునీత ఆదేశం



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి):

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లతో కలిసి కలెక్టర్ విజయ సునీత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇక్కడ అరకులోయ



డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పార్లమెంట్ స్థానం, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు వేర్వేరుగా స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న పలు గదులను ఆమె పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను, పోలింగ్ సామగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వాహనాలకు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలను పాటిస్తూ ఎన్నికల నిర్వహణపై ఎటువంటి ఇబ్బందులు, పొరపాట్లకు తావులేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, ఏఎస్పీ కె.ధీరజ్, రెవెన్యూ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నాలుగు పోలింగ్ కేంద్రాల మార్పు

భద్రత కారణాల దృష్ట్యా నిర్ణయం

కొయ్యూరు, ఫిబ్రవరి 29:

రానున్న సార్వత్రిక ఎన్నికలకు నాలుగు పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీ రేవులకోట, ఎం.భీమవరం పంచాయతీ పీఎల్ కొత్తూరు పోలింగ్ కేంద్రాలను పలకజీడి జీపీఎస్ పాఠశాలలో, అలాగే బూదరాళ్ల పంచాయతీ కన్నవరం కేంద్రాన్ని గరిమండకు, కునుకూరు కేంద్రాన్ని బాలరేవులకు మార్చాలని అధికారులు నిర్ణయించారు. అయితే పీఎల్ కొత్తూరు కేంద్రాన్ని మార్పు చేయడం వల్ల పెదలంక, పుట్టకోట, మందపల్లి తదితర గ్రామాల ప్రజలు ఓటు వేయాలంటే సుమారు 20 కిలోమీటర్లు మేర దట్టమైన అటవీ ప్రాంతం నుంచి నడిచి రావాలి. 2004, 2014 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సమయంలో మావోయిస్టులు పలకజీడి పోలింగ్



రేవులకోట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే పలకజీడి జీపీఎస్ పాఠశాల



పీఎల్ కొత్తూరు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే పలకజీడి పాఠశాల భవనం

కేంద్రంపై దాడి చేయడం, బ్యాలెట్ బాక్సులు ఎత్తుకుపోవడం, సిబ్బందికి ఏర్పాటు చేసిన జీపును కాల్చివేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. 2004, 2014 ఎన్నికల సమయంలో పలకజీడి నైసర్గిక స్థితి ప్రస్తుతం రేవులకోట, పీఎల్ కొత్తూరు పరిస్థితి ఒకేలా ఉండడంతో గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ రెండు కేంద్రాలను పలకజీడిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈసారి కొత్తగా ఏర్పాటు చేస్తున్న కన్నవరం, కునుకూరు కేంద్రాలను మావోయిస్టు సమస్య నేపథ్యంలో కన్నవరం కేంద్రాన్ని గరిమండకు, కునుకూరు కేంద్రాన్ని బాలరేవులకు తరలించినట్టు తహసీల్దారు రాజేశ్వరావు తెలిపారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటిని మార్పు చేయాలనే ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు తహసీల్దారు వివరించారు.

అనకాపల్లి జిల్లాలో నిజం గెలవాలి

» మృతుల కుటుంబాలకు భువనేశ్వరి ఓదార్పు

నిజం గెలవాలి పర్యటనలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో గురువారం పర్యటించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భువనేశ్వరి జనంతో మమేకమయ్యారు. ఆమెను చూసేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అందర్నీ భువనేశ్వరి ఆప్యాయంగా పలకరించారు.



మునగపాక మండలం అరబుపాలెం గ్రామంలో నారా భువనేశ్వరి పరామర్శిస్తున్న సందర్భంగా కన్నీరు పెట్టుకుంటున్న బద్దేడ నాయుడు కుటుంబ సభ్యులు



రోలుగుంట మండలం జేపీ అగ్రహారంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి



రావికమతం మండలంలో మహిళలతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

క్రైం... crime news

మరిడిమాంబ ఆలయంలో చోరీ

» అమ్మవారి ఆభరణాల అపహరణ

» హుండీలు పగులగొట్టి నగదు తస్కరణ

» సీసీ కెమెరాలు ధ్వంసం



వెలవెలబోతున్న అమ్మవారి విగ్రహం

మాడుగుల, ఫిబ్రవరి 29: మాడుగుల శివారు ఖండివరం వెళ్లే మార్గం పంటపొలాల మధ్యలో ఉన్న మరిడిమాంబ ఆలయంలో బుధవారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఆలయ నిర్వాహకులు ఎప్పటిలాగానే బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయానికి తలుపులు వేసి వెళ్లిపోగా, అర్ధరాత్రి సమయంలో ఆలయం ఉత్తరం వైపుగా ఉన్న గేట్ల తాళాలను దొంగలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మెడలోని వెండి హారం, చెవిదుద్దులు అపహరించారు. అలాగే అమ్మవారి ఆలయంలో గల రెండు హుండీలను విరగ్గొట్టి అందులో నగదు అపహరించి ఆ హుండీలను ఆలయ సమీపంలో పడేశారు. అయితే గతంలో ఇదే మాదిరిగా చోరీ జరగడంతో అప్రమత్తమైన కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు హార్డ్ డిస్క్, మానెటర్‌ను కూడా పట్టుకుపోయారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు.



సీసీ కెమెరా వైర్లను పీకి పారేసిన దృశ్యం



గుడి బయట పారేసిన హుండీలు

కొలిక్కిరాని పింఛన్ నగదు చోరీ కేసు

» ఏడాది గడిచినా రికవరీ కాని సొమ్ము

మాకవరపాలెం, ఫిబ్రవరి 29: పింఛన్ నగదు చోరీ కేసు ఏడాది గడిచినా ఇంకా కొలిక్కి రాలేదు. మండలంలో శెట్టిపాలెం సచివాలయం కార్యదర్శి నవ్యశ్రీ మాకవరపాలెం ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి 2023 ఏప్రిల్ 3వ తేదీ మధ్యాహ్నం రూ.16,15,750 నగదు తీసుకువెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆ నగదును చోరీ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేస్తున్నా ఈ కేసులో ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. దీనిపై ఎస్‌ఐ రామకృష్ణారావు వివరణ కోరగా ఇటీవల నక్కపల్లిలో పింఛన్ నగదు చోరీ కేసులో కొందరిని అరెస్టు చేశామని, వారే మాకవరపాలెం పింఛన్ నగదు చోరీ కేసులో ఉన్నారన్నారు. అయితే చోరీకి గురైన నగదు రికవరీ కాలేదన్నారు. దీనిపై ప్రస్తుత ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పింఛన్ నగదు చోరీపై అప్పటి ఎంపీడీవో అరుణశ్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కొత్తూరు, ఫిబ్రవరి 29: మండలంలోని శంకరం జాతీయ రహదారి పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వర రావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బట్లపూడి గ్రామానికి చెందిన టి.నూకరాజు(62) అనకాపల్లి నుంచి ఆటో వస్తున్నాడు. శంకరం వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో సబ్బవరం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

టూరిజం సర్క్యూట్ బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రోజా

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ, పిలిగ్రిమ్ పాత్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి టూరిజం సర్క్యూట్ బస్సులను గురువారం ప్రారంభించింది. బీచ్ రోడ్డు నోవాటెల్ ఎదురుగా పర్యాటక శాఖ మంత్రి రోజా బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి బస్సులు దోహదపడతాయన్నారు. ఇందులో భక్తులకు శీఘ్ర దర్శనం, విశేష పూజ ఉంటాయన్నారు. తిరుమల, శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం తదితర 18 ప్రసిద్ధ ఆలయాలను అనుసంధానం చేస్తూ ప్యాకేజీరూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, రవిబాబు, ఏపీటీడీసీ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పర్యాటక శాఖ ఎండీ కన్నబాబు, జేసీ మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై రోజూ టాటానగర్- ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, ఫిబ్రవరి 29: ప్రయాణికుల సౌకర్యార్థం టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ఫ్రీక్వెన్సీని పెంచుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రస్తుతం వారానికి రెండు రోజులుగా నడుస్తున్న ఈ సర్వీసులు ఇకపై ప్రతిరోజు అందుబాటులో ఉంటాయన్నారు. 18189 నంబరు గల టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ మార్చి ఏడు నుంచి, తిరుగు ప్రయాణంలో 18190 నంబరు గల ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ మార్చి పది నుంచి ప్రతిరోజూ నడిచేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ సర్వీసులకు మూడు సెకండ్ ఏసీ, ఏడు థర్డ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ ఎకానమీ, నాలుగు స్లీపర్, ఒక జనరల్ క్లాసు, ఒక ఏసీ ప్యాంటీ కార్, రెండు సెకండ్ క్లాసు, రెండు సెకండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00


కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చింతపండు రైతు దిగాలు

» కోనాం సంతలో లభించని గిట్టుబాటు ధర

» కిలో రూ.30 నుంచి రూ.35లకు విక్రయం



కోనాంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ, ఫిబ్రవరి 29: మండలంలో కోనాం సంతకు వచ్చిన ఏజెన్సీ చింతపండుకి ఆశించిన ధర లభించక గిరిజన రైతులు దిగాలు చెందారు. మండలంలోని కోనాం పంచాయతీతో పాటు హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన పలు ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి గురువారం కోనాం సంతకు చింతపండు తీసుకువచ్చారు. ఏజెన్సీ గ్రామాల్లో తుప్పలు, డొంకల నుంచి నడుచుకుంటూ వేకువజామున బయలుదేరి ఉదయం 9 గంటలకు కోనాం చేరుకున్నారు. గత వారం చింతపండుకి కిలో రూ.65లు నుంచి రూ.70ల వరకు ధర పలకడంతో ఈ వారం కూడా ఎక్కువ ధర వస్తుందని ఆశించిన గిరిజనులు ఎక్కువ చింతపండును తీసుకువచ్చారు. అయితే ఈ వారం ధర రూ.30ల నుంచి రూ.35లు పలకడంతో గిరిజన రైతులు నిరాశకు గురయ్యారు. అయితే ఈ గురువారం జిల్లాలో పలు శుభకార్యాలు ఉండడంతో వ్యాపారులు కూడా ఎక్కువ మంది రాకపోవడంతో మధ్యాహ్నం వరకు వేచి చూసిన గిరిజనులు కొంతమంది కోనాంలో వారి బంధువుల ఇంటి వద్ద చింతపండు నిల్వ చేయగా, మరికొంతమంది గిరిజనులు వ్యాపారులు అడిగిన ధరకు అమ్మి నిత్యావసర ధరలు కొనుగోలు చేసుకొని నిరాశతో స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

'బాల్య వివాహాలను అరికట్టడంలో విఫలం'



సమగ్ర బాలల పరిరక్షణ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 29: బాల్య వివాహాలను అరికట్టడంలో సచివాలయం మహిళా పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం ఆరోపించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, 2023 నిబంధనలపై డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2025 నాటికి బాల్య వివాహాలు నిర్మూలన లక్ష్యంగా పెట్టుకుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో సచివాలయంలోని మహిళా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహం ఆపినట్టు కాగితాల్లో చూపుతున్నారని, అదే వివాహం పక్క ఊర్లోనో... గుడిలోనో జరిగిపోతుందని చెప్పారు. ఈ విధంగా 13 అనధికార వివాహాలు జరిగినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాలపై ఎఫ్‌ఐఆర్‌లు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాల విషయంలో రాజకీయ నాయకుల జోక్యం ఉంటే భయపడవద్దని సూచించారు. ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో గత నాలుగు నెలల్లో 86 బాల్య వివాహాలను ఆపామని తెలిపారు. ఆర్డీవో హెచ్‌వీ జయరాం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువు మీద శ్రద్ధ పెట్టాలని సూచించారు. మంచి విద్య అందిస్తే ఏ పథకాలు, ఎవరి మీద ఆధారపడే పరిస్థితి రాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త, ఎంఈవో తలుపులు, సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన టీడీపీ సీనియర్ నేతలు



భువనేశ్వరికి నూకాలమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 29: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని నర్సీపట్నంలోని రాయల్ పార్కు రిసార్ట్‌లో ఆ పార్టీ సీనియర్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించి పెదబొడ్డేపల్లిలోని రాయల్ పార్క్ రిసార్ట్‌లో బుధవారం రాత్రి బస చేసిన విషయం తెలిసిందే. గురువారం నర్సీపట్నం నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర తదితరులు భువనేశ్వరిని కలిశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా బలంతో పాటు దైవ బలం తోడై చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి పూజలు చేసి తీసుకొచ్చిన అమ్మవారి చిత్ర పటాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, బొడ్డేడ జోగినాయుడు, పోలవరపు త్రినాథ్, బుద్ద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్



టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయని, టీడీపీ, జనసేన సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో బుధవారం నిర్వహించిన జెండా సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని, జగన్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతున్నాడని అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. టీడీపీ, జనసేన వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేతులు కలపలేదన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం రెండు పార్టీలు కలిశాయన్నారు. టీడీపీ, జనసేన కూటమితో కలిసి వచ్చి రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలిపారన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్లారని విమర్శించారు. వైసీపీ వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెటర్ హనుమ విహారి పారిపోయాడన్నారు. వైనాట్ 175 అంటున్న జగన్‌రెడ్డికి మనం ఎందుకు ఓటు వేయాలో అడుగుతున్నామన్నారు.

జగన్ ఏం సాధించాడని, జాబ్ క్యాలెండర్ ఎక్కడ?, డీఎస్సీ ఎక్కడ? ఉచిత ఇసుక ఎక్కడ? అని నాగజదీశ్ ప్రశ్నించారు. పులివెందులలో జగన్‌రెడ్డికి ఓటమి తప్పదని అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే సూపర్ 6ను ప్రవేశపెట్టారని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉందన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని ఆయన చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఎన్నికలే కీలకం

» ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సులో వక్తలు



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణే కీలకమని, ఆ దిశగా ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం 'భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అన్న అంశంపై ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్య ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు అసాధారణమైనవని, రాజ్యాంగ రక్షణ కోసమని ప్రజలు భావించాలన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం భూస్థాపితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం బుట్టదాఖలు చేసిందన్నారు. సీబీఐ మాజీ ఉన్నతాధికారి వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ ద్వారకవద్ద సముద్ర గర్భంలో పర్యటించారని, బంగాళాఖాతంలో పర్యటిస్తే ఏపీకి ఇచ్చిన విభజన హామీలు, ప్రత్యేక హోదా వంటివి తెలిసేవన్నారు. ఢిల్లీ పాలకుల మెడలు వంచుతామని చెప్పుకున్న నాయకులు అక్కడ తమ మెడలే వంచుకుని వస్తున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖపట్నానికి కేంద్రం అన్ని విధాలుగా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మణిశంకర్ అయ్యర్, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేష్, సిఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఓబులేసు, జగ్గునాయుడు, ఎం.పైడిరాజు, విమల, విజయరావు, సీతామహాలక్ష్మి ప్రసంగించారు.

బయ్యవరంలో చందనోత్సవం రేపు



చందనోత్సవానికి సిద్ధమైన దర్గా

కశింకోట, ఫిబ్రవరి 29: మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గాలో మార్చి 2న 72వ ఉరుస్ చందనోత్సవం జరగనున్నదని ఉత్సవం కార్యదర్శి జనాబ్ మహమ్మద్ అయాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి ఇషానమాజ్ తరువాత ఖురాన్‌ఖానీ, మిలాద్ షరీఫ్ (చందనోత్సవం) కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. శనివారం ఉదయం నుంచి గుసుల్ షరీఫ్ చందనం పూస్తారన్నారు. రాత్రి 10 గంటల నుంచి దర్గా ప్రాంగణంలో ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతర రాట



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 29: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా గురువారం అమ్మవారి బాలాలయంలో రాట ముహూర్తాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభం కానుందని, ఎనిమిదో తేదీన కొత్త అమావాస్య పూజలు జరగనున్నాయని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిదో తేదీన ఆలయంలో ఉగాది వేడుకలు జరుగుతాయన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, ధర్మకర్తలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29: జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలపై గురువారం ఆయన వివరించారు. ఈ మేరకు ఆయన పోలీసు కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో 38 కేంద్రాల్లో 28,621 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వీరంతా ఉదయం ఎనిమిది గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఒక్క నిమిషం దాటినా అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం నుంచి విద్యార్థులను బయటకు అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ

» పరిశీలించిన కలెక్టర్



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : జిల్లా పోలీస్ కార్యాలయ సమీపాన భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్‌మిషన్ (ఈవీఎం) స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా ఆయన ఈ స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించడంతోపాటు సీల్‌ను కూడా పరిశీలించారు. సీసీ టీవీల ఫుటేజిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రామ్మూర్తి, డీటీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నర్సీపట్నం డీఎస్పీ మోహన్



ఎస్పీకు పూలమొక్కను అందిస్తున్న డీఎస్పీ మోహన్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 29: నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీఆర్ఆర్ మోహన్ గురువారం ఎస్పీ కేవీ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి డీఎస్పీకి ఎస్పీ పలు సూచనలు చేశారు.

మాతృభాష విద్యా వలంటీర్ల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న బాలదేవ్

పాడేరురూరల్, ఫిబ్రవరి 29 : గిరిజన ప్రాంతంలో మాతృభాష బోధనతో ప్రాథమిక విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న ఆదివాసీ మాతృభాష విద్యా వలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలలకు రెన్యువల్ చేసి కొనసాగించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ హెచ్చరించారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద మాతృభాష విద్యా వలంటీర్లు గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష వలంటీర్లను ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కొనసాగించడంతో పాటు 2024- 25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విధుల్లో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాతృ భాష వలంటీర్ల గడువు ఫిబ్రవరి 29వ తేదీతో ముగించడం అన్యాయమన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలను మార్చి 6వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, జిల్లా నాయకులు కొండబాబు, చిన్నమ్మి, కృష్ణ, నూకరాజు, ఆనందరావు, మత్స్యరాజు, సత్యవతి పాల్గొన్నారు.

ఏఎన్ఎం శిక్షణ కేంద్రం తనిఖీ

▸▸ రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో జమాల్ బాషా



ఏఎన్ఎం శిక్షణ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎన్ఎం శిక్షణా కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఏఎన్ఎం అభ్యర్థినులకు అందిస్తున్న శిక్షణ, భోజన మెనూ, వారికి సమకూర్చుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని, శిక్షణ పొందుతున్న అభ్యర్థినుల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శిక్షణ కేంద్రం ప్రత్యేకాధికారిణి, సిబ్బంది పాల్గొన్నారు

'వైసీపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం'



పరదేశీపుట్టులో గిరిజనులతో కలిసి నినదాలు చేస్తున్న పార్వతమ్మ

జి.మాడుగుల, ఫిబ్రవరి 29 : గిరిజన ప్రాంతంలో కనీస సౌకర్యాల కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ గిరిజన మేధావుల మోర్చ కన్వీనర్ కురుసా పార్వతమ్మ ఆరోపించారు. కె.కోడాపల్లి పంచాయతీ పరదేశీపుట్టులో గురువారం ప్రజాపోరు యాత్ర ముగింపోత్సవంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో ప్రజలంతా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్ల రామకృష్ణ, బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకేవీధి మండలం సీలేరు, దప్పిలివాడ పంచాయతీలో బుధవారం బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పనసల జోగిరాజు ఆధ్వర్యంలో చింతపల్లి క్యాంప్, సీలేరు, పార్వతీనగర్, బూసికొండ, వలసగెడ్డ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కేంద్ర పథకాల గురించి వివరించారు. జిల్లా యువజన మోర్చ ప్రధాన కార్యదర్శి కాకూరి శేఖర్ , జిల్లా యువజన మోర్చ కార్యదర్శి టి.శ్రీను, మండల ఉపాధ్యక్షుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం 'సూపర్ సిక్స్'ను అమలు చేస్తుందని, మహిళలకు మరిన్ని పథకాలను తీసుకువస్తుందని భరోసా ఇచ్చారు. 'జగనాసుర పాలనను అంతమొందిస్తాం, చంద్రబాబును మళ్లీ సీఎంను చేస్తాం' అంటూ మహిళలు విజయ సంకేతం చూపుతూ నినాదాలు చేశారు. రావికమతం మండలం గంపవానిపాలెం సభలో కిత్తంపేటకు చెందిన చెన్నంశెట్టి జగ్గమ్మ మాట్లాడుతూ, వెలుగు సీఏగా పనిచేస్తున్న తాను టీడీపీ సానుభూతురాలని కావడంతో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ తనను ఉద్యోగంలో నుంచి తీసేయించారని కన్నీరుపెట్టుకుంది. భువనేశ్వరి స్పందిస్తూ చంద్రబాబు త్వరలో మళ్లీ సీఎం అవుతారని, వైసీపీ ప్రభుత్వ బాధితులందరికీ న్యాయం చేస్తారని భరోసా ఇచ్చారు.

నారా భువనేశ్వరి పర్యటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, దాడి రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



లంబసింగిలో మంచు కురుస్తున్న దృశ్యం

... 5వ పేజీ తరువాయి

మరోసారి పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ ఉదయం వేళల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. గురువారం చింతపల్లిలో 17.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రానున్న రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం రాత్రి వేళ చలి తీవ్రంగా ఉన్నది. పగటి పూట ఎండ అధికంగా ఉన్నది. ఈ విభిన్న వాతావరణంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.

సమస్యలపై ఉపాధ్యాయులు ధర్నా

▸▸ విద్యా వ్యవస్థను నాశనం చేసే జీవో 117ను రద్దు చేయాలి ▸▸ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు డిమాండ్

పాడేరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను నాశనం చేసే జీవో 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు పాడేరులో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 117తో బడుగు, బలహీన వర్గాలకు ప్రాథమిక విద్య దూరమైందన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పని భారం అధికమైందని, రాష్ట్రంలో 11 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయని, ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులంతా యాప్‌ల భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, 11వ పీఆర్సీ బకాయిలు, ఇతర ఆర్థిక బకాయిలతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఫెడరేషన్ నేతలు ఎ.శ్యామ్ సుందర్, శెట్టి శాంతికుమారి, పోతురాజు, భైరవ మూర్తినాయుడు, ఎం.సత్యారావు, కన్నారావు, రామ చంద్రుడు, బి.ఈశ్వరరావు, సుశీల, రమ్య ప్రియ, రత్న కుమారి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత జగన్మోహన్‌రావు

చింతపల్లి: ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ వైసీపీ ప్రభుత్వం పాత పింఛన్ విధానం(ఓపీఎస్)ను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరి శశికుమార్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి బౌడు గంగరాజు అధ్యక్షతన గురువారం పాత తాలూక కేంద్రం చింతపల్లిలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఐఆర్ 30శాతం వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని, జీవో నంబరు 117ను రద్దుచేసి పెండింగ్ డీఏలు ప్రకటించాలని, ఉపాధ్యాయులపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి బౌడు గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకర చంద్రరావు, నాయకులు గెమ్మెలి మోహనరావు, అచ్చిబాబు, కామేశ్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ఫెడరేషన్ నాయకులు నినాదాలు

గిరిజనాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

▸▸ 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'లో మాజీ మంత్రి మణికుమారి



గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న మణికుమారి

చింతపల్లి, ఫిబ్రవరి 29 : గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి అన్నారు. మండలంలోని శివారు సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన బలపం, కోరుకొండ, తడ్డపల్లి, ఎగజనబ, దిగజనబ గ్రామాల్లో గురువారం టీడీపీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధినాయకుడు చంద్రబాబు ప్రకటించిన పథకాలపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందని, ఒక్కసారిగా పార్టీకి ప్రజాదరణ పెరిగిందని వివరించారు. ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఆదివాసీల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి 15పథకాలను రద్దు చేశారన్నారు. గిరిజనులకు సంక్షేమ పథకాలు అందాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు మళ్లి ముఖ్యమంత్రి కావాలన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వెంకయమ్మ, నాయకులు చిట్టిబాబు, నాగప్ప, పిన్ని దొర, వినోద్ ముర్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులతో కోళ్లలో కొక్కెర తెగులు

▸▸ రైతులు నివారణ చర్యలు చేపట్టాలి ▸▸ పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖరరావు



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏడీ చంద్రశేఖరరావు

చింతపల్లి, ఫిబ్రవరి 29 : వాతావరణంలో మార్పు వల్ల కోళ్లలో కొక్కెర తెగులు వ్యాప్తి చెందుతుందని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు సూచించారు. ఇక్కడి ప్రాంతీయ పశు ఆస్పత్రిలో పాడి రైతులకు గురవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శీతాకాలం నుంచి వేసవిలో ప్రవేశిస్తుండడంతో పగటి ఉష్ణోగ్రతలు అధికంగాను, రాత్రి ఉష్ణోగ్రతలు అత్యల్పంగా ఉంటాయన్నారు. ఈ వాతావరణాన్ని కోళ్లు తట్టుకోలేక కొక్కెరి తెగులు వ్యాప్తి చెందే అవకాశముందన్నారు. ఈ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని, మందులేదన్నారు. రైతులు వ్యాధి కోళ్లకు సోకకుండగా ప్రతి మూడు నెలలకు ఒకసారి లసోటగాని, ఎఫ్1 వ్యాక్సిన్ చేయించాలన్నారు. ఈ తెగులు నివారించుకునేందుకు పశుసంవర్ధక శాఖ మార్చి, ఏప్రిల్‌లో కోళ్లకు వ్యాక్సిన్ వేయనుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పశువులకు హెల్త్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెటనరీ అసిస్టెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కేంద్రానివే'



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో 80శాతం కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుస ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవరాపల్లి పంచాయతీ లక్కవరంలో గురువారం ప్రజాపోరు యాత్ర నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ పథకాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవే నన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీటి పేర్లు మార్చి, తన చిత్రంతో కూడిన స్టిక్కర్లు అతికించుకుని వైసీపీ ప్రభుత్వం అమ లుచేస్తున్న పథకాలు మాదిరిగా ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కటారి పార్వతమ్మ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి'



యువతకు వాలీబాల్ కిట్ అందిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

సీలేరు ఫిబ్రవరి 29 : గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలని సీలేరు ఎస్ఐ రామకృష్ణ సూచించారు. జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కొండజర్త, తార్నివాడ గ్రామాలలో ఎస్ఐ సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండజర్తలో ధారకొండ వైద్యాధికారిణి హిమబిందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వైద్య శిబిరాన్ని సందర్శించారు. కొండజర్త, తార్నివాడ గ్రామాల్లో యువతకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు.

'ఇళ్ల లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి'

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 29 : ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 741 మందికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందన్నారు. వీరంతా గ్రామ సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుంటే స్థలంపై సంపూర్ణ హక్కు పొందుతారన్నారు.

క్షతగాత్రునికి టీడీపీ నేతల పరామర్శ



క్షతగాత్రుడ్ని పరామర్శిస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, ఫిబ్రవరి 29 : ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి, ఇక్కడి జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న జి.మాడుగుల మండలం కోనేటి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శోభ రామారావును గురువారం ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆమె కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం పాడేరులో నిర్వహించిన నిజం గెలవాలి కార్యక్రమానికి వచ్చిన రామారావు తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగివెళ్తున్న సమయంలో కలెక్టర్ బంగ్లా సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కుడికాలు విరిగిపోవడంతో స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఈశ్వరి ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. నాయకులు జి.సింహాచలం, కె.కోటిబాబు పాల్గొన్నారు. అదే విధంగా ప్రమాదంలో గాయపడ్డ రామారావును మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, బొర్రా నాగరాజు, వంజంగి కాంతమ్మ, బొర్రా విజయరాణి తదితరులు పరామర్శించారు.

సంతలో మిరియాల ధర పతనం!



హుకుంపేట ఫిబ్రవరి 29 : మిరియాల ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు వారాల నుంచి వారపు సంతకు వచ్చే వ్యాపారులు సిండికేట్‌గా మారి తమకు నచ్చిన ధరకు కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని వారంతా వాపోతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జీసీసీ ద్వారా మిరియాలను కిలో రూ.530 చొప్పున కొనుగోలు చేయాలని ప్రకటన చేయడంతో ఆ మేరకు సంతకు వచ్చే వ్యాపారులు రూ.540 నుంచి రూ.550 వరకు ధరను చెల్లించి కొనుగోలు చేసేవారని గిరిజన రైతులు చెపుతున్నారు. కానీ ప్రస్తుతం జీసీసీ వారపు సంతలో కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు కుమ్మక్కై రూ.470 నుంచి రూ.480కి కొనుగోలు చేస్తున్నారని పర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మిరియాలుకు జీసీసీ రూ.550 నుంచి రూ.600 చెల్లించి కొనుగోలు చేయాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

మేమున్నామని.. మీకేం కాదని..

▸▸ బాధిత కుటుంబాల్లో భరోసా నింపిన నారా భువనేశ్వరి

▸▸ మన్యంలో 'నిజం గెలవాలి' విజయవంతంతో తెలుగు మహిళల్లో జోష్



జి.మాడుగులలో లక్ష్మణరావుకు నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి



పాడేరు : కిండంగిలో నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శిస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమం ద్వారా టీడీపీ కార్యకర్త కుటుంబాలను పరామర్శించి భరోసా నింపారు. ఏజెన్సీలో ఆమె పర్యటించిన అరకులోయ మండలం మసిరిగుడ గ్రామంలో సొనాయి బసు, జి.మాడుగుల మండలంలో కోరాబు లక్ష్మణరావు, అనసూరి రాజారావు, పాడేరు మండలం కిండంగిలో ఓంద్రు నాగేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ సంపూర్ణంగా ఆదుకుంటుందని, వారంతా తమ పార్టీ కుటుంబీకులను బాధిత కుటుంబాల్లో భువనేశ్వరి భరోసా నింపారు. దీంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, గిరిజన ప్రాంతంలో నారా భువనేశ్వరి నిర్వహించిన 'నిజం గెలవాలి' కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతం కావడంతో మన్యంలో తెలుగు మహిళల్లో జోష్ పెరిగింది. భువనేశ్వరి గిరిజన ప్రాంతానికి తొలిసారిగా రావడంతో పాటు అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించడం, పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామంలో గిరిజన మహిళలతో సమావేశం నిర్వహించడం అందర్నీ ఆకర్షించింది. అలాగే భువనేశ్వరి సైతం ప్రతి చోటా మహిళలు, గిరిజనులతో మమేకం కావడంతో ఆమె గిరిజనుల మన్ననలు పొందారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎంవీవీ ప్రసాద్, బొర్రా నాగరాజు, టీడీపీ నేతలు కిల్లు వెంకటరమేశ్‌నాయుడు. కోడా వెంకట సురేశ్‌కుమార్, దప్పోడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అరకులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

అరకులోయ, ఫిబ్రవరి 29 : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ముందు ఉన్న ఆక్రమణలను తొలగించే పనులను అధికారులు గురువారం చేపట్టారు. ఇందుకు సంబంధించి గతంలో వీరికి నోటీసులను జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు ఆక్రమణలను తొలగించేందుకు జేసీబీని సిద్ధం చేశారు. ఆక్రమణదారులే స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. అనంతరం గోడలను జేసీబీ ద్వారా తొలగించారు.

కుడా బీరులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

హుకుంపేట ఫిబ్రవరి 29 : మండలంలోని సంతరి పంచాయతీ కుడాబీరు గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులకు జడ్పీటీసీ, అరకు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడా రాజుబాబు గురువారం శంకుస్థాప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీటీసీ సుశీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

'దశలవారీగా గ్రామాల్లో సదుపాయాలు'

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 29 : అన్ని గ్రామాలలో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఎంపీపీ ఎ.సీతమ్మ తెలిపారు. జోడిపుట్టు, వనుగుమ్మ పంచాయతీల్లో గురువారం ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచ్‌లు వసంత, మిల్కీ, గంగాధర్, నీలకంఠం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పాడేరు కూడలిలో హైమాస్ట్ వెలుగులు

పాడేరు రూరల్ , ఫిబ్రవరి 29 : పట్టణంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి సహకారంతో ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా పీటీడీ కాంప్లెక్స్ జంక్షన్‌లో ఈ లైట్లను ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఎంపీడీవోకు వీడ్కోలు



బదిలీపై వెళుతున్న ఎంపీడీవోను సన్మానిస్తున్న నేతలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 29 : ఇక్కడి నుంచి బదిలీపై వేరొక మండలానికి వెళుతున్న ఎంపీడీవో చందర్‌రావుకు గురువారం కార్యాలయ సిబ్బంది, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దంపతులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, నాయకులు కృష్ణారావు, సింహాచలం, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'డొంకరాయి' కెనాల్‌కు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రశాంత్ కుమార్

సీలేరు, ఫిబ్రవరి 29 : డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు ప్రారంభించినట్టు సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం డొంకరాయి జలాలను పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేసి, కెనాల్ నిర్వాహణ పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది డొంకరాయి పవర్ కెనాల్ నిర్వాహణ పనులు చేపడుతుంటామని, ఈ ఏడాది నిర్వాహణ పనులు ప్రారంభించామన్నారు. గ్రౌటింగ్ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రంలో కాంప్లెక్స్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో ఎట్టకేలకు ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 29 : మండల కేంద్రం డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడ ఈ కళాశాల ప్రారంభమైన సుమారు 22ఏళ్లకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని అధికారులు మంజూరు చేశారు. దీంతో ఈ కళాశాల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 395 మంది, కేజీబీవీ కళాశాల నుంచి 74మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు.

ముంచంగిపుట్టు : ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్టు ఇక్కడి కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 304 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 200 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు.

జి.మాడుగుల : ఇంటర్ పరీక్షలకు మండలం నుంచి 937 మంది విద్యార్థులు హాజరు కానున్నారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండన్న తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సెంటర్‌లో స్థానిక ప్రభుత్వ జూనియార్ కళాశాల, కేజీబీవీ, ప్రభుత్వ జూనియార్ కళాశాలల నుంచి విద్యార్థులకు పరీక్షలు రాయనున్నారన్నారు.